# కొమ్మిపూలు

"ద్దో...అడుంది చూడు పాళెంగుట్ట. ఆ గుట్టకు ఆ...కడాన ఎ...త్తుగా ఉండాయే పెద్ద బండలు, ఆడ అక్కదేవతలుండారు. ఆడికి పొయ్యినామంటే మంచి వాసన వస్తాది," అనింది గజమ్మ మేముండే కాన్నించి తూర్పుగా మూడు కిలోమీటర్ల దూరంలోని గుట్టను చూపిస్తా.

"ఆ పక్కన ఉండాయే బండలు...ఆడేనా?" అడిగినా.

"అన్నే...ఇంగోటి చెప్తే నువ్వు నమ్మవుబా. ఆ బండలకు ఎడంపక్కన బోడిగా ఉండాదే పెద్ద బండ. ఆ బండపైన రెండు గుంతలుండాయి. వాటిల్లో ఎప్పుడూ నీళ్లుంటాయి. ఇంత తగ్గులో ఉండాం కదా, ఈ ఊర్లో నీళ్లు లేకపోయినా...ఎంత వరుపన్నా గానీ, ఆడ మాత్రం ఎప్పుడూ ఉంటాన్నేయి. ఇప్పుడుండాయో లేదో తెలీదు. నేను పొయ్యి పదేండ్లు అయితాండాది," అనింది గజమ్మ.

"ఔను బావా...నేను కూడా పీలేరు ఆస్టల్‌లో చేరక ముందు పొయ్యినా. నీళ్లున్నేయి ఆడ," అన్నాడు నా ఆరో బామ్మర్ది.

"ఇప్పుడు గూడా ఉంటాయనుకుంటా. అదంతా ఆ ఎంకటేశ్వరస్వామి మహత్యం...గాడి మదిరిగా ఉండాదంటినే అది ఎంగటేశ్వరస్వామి అడుగంట. ఆ పక్కనుండేది ఆయన ఎక్కి తిరిగే గుర్రం అడుగంట. మేమంతా చిన్నబ్బుడు ఎద్దల కాడికి పోయినప్పుడంతా ఆ గుట్ట ఎక్కతాంటిమి. ఆడ రంగు రాళ్లు ఎక్కువగా ఉంటాయి. నీళ్ళ దెగ్గరికి పోయి నీళ్ళేసి సాది నష్టన బొట్టు పెట్టుకోనొస్తాంటిమి. రాళ్ళు సాది సాది గుంతలు పన్నేయి," అనింది గజమ్మ. ఆ మాటలనేటప్పుడు ఆమె ముఖంలో అదొక విధమయిన ఆనందం.

"అయితే మేము ఆడికి పోతాంకా...మీరొస్తారా?"

"ఓ...వస్తాం...పోదాంపద బావా," అన్నారు నా బామ్మర్దులంతా .

"అంత దూరం పోతారా? చానా దూరమబ్బ," అనింది గజమ్మ.

"ఎంతదూరం ఉంటుందికా... ఎర్రావారిపాళెం క్రాసు కాన్నించి ఈడికి ఉండేంత దూరంకన్నా ఎక్కువా?" ప్రశ్నించినా.

"అంత దూరం ఉండదులే."

"మొన్న ఈడికి వచ్చినప్పుడు అట్నించి నడుసుకోని వచ్చినా."

"ఔనా...! బస్సు పడక ముందు మేమంతా నడిచే కదా పోతాన్నింది. ఇప్పుడు కూడా వారంలో రెండు రోజులు బస్సురాదులే. అప్పుడు నడసాల్సిందే."

"పోదాం పద బావా," తొందర చేస్తాండారు బామ్మర్దులు.

"బావా...ఆడికి చానా దూరం. నూరు మైళ్ళుంటాది," అనింది పదేండ్ల బుడిగి మరదలు.

"వెయ్యి మైళ్ళున్నా పోతాం," అన్నాడు చిన్న బామ్మర్ది.

మా ఆవిడకు ముగ్గురు పిన్నులు. వాళ్ళకు మొత్తం నలుగురు అమ్మాయిలు, ఏడుగురు అబ్బాయిలు. ఆ ఇంటికి నేనే పెద్దల్లుడిని. మిగిలిన వాళ్లకు ఇంకా పెళ్ళి కాలేదు. పెద్ద మరదలు మాత్రం డిగ్రీ. మిగిలిన వాళ్ళంతా ఇంటర్ నుంచి ఏదో తరగతి దాకా ఉండారు. వాళ్ళందరికీ అమ్మమ్మోళ్ళ ఊరు ఎర్రావారిపాళెం మండలంలోని ఆదినవారిపల్లె. ప్రతి సంక్రాతి పండుగకు పిల్లలను తీసుకుని అందరూ అక్కడికి వస్తుంటారు. ఈ సంవత్సరం కూడా అందరూ వచ్చారు. సంక్రాంతి పండుగ వచ్చిందంటే సంబరమంతా అక్కడే ఉంటుంది. భోగి, సంక్రాతి అయిపోయాయి. ఆరోజు కనుమ. పొద్దున్నే కోడికూర, దోసెలు తిని అందరం మిద్దె మీదకు పోయినాం. అప్పుడు చెప్పింది గజమ్మ ఆ పాళెంగుట్ట గురించి.

గుట్టమీద అక్కదేవతలుండే తావన వాసన... బోడిమండి మీద వెంకటేశ్వరుని అడుగు... గుర్రం అడుగు... అక్కడ నీళ్లు... నీళ్ల పక్కన గజమ్మోళ్ళు రాళ్ళు సాదిండేది చూడాలనుకున్నా.

ఏడుమంది బామ్మర్దులను వెంటబెట్టుకుని ఎలబారినా.

"మేమంతా ఇక్కన్నించి చూస్తానే ఉంటాం. గుట్టెక్కతానే ఆడ్నించి చేతులూపండి," అన్నారంతా మిద్దె మీద నుంచి.

సరేనన్నాం. నేను లుంగీతో ఉండాను. బామ్మర్దులంతా ఫేంట్‌లు వేసుకోనుండారు.

"గుట్టకు పొయ్యే దోవలో పెద్దులింజి కాయలుంటాయి. పుల్లీలకల పండ్లుంటాయి. పెరుక్కోని రాండి."

"గుట్టకింద పరికిచెట్లు ఎక్కువుండాయి. పరిక్కాయలు, రేణిగాయలు కూడా పెరుక్కోని రాండి."

"చెరువు కట్ట మింద యలకచెట్టుండాది. యలక్కాయలు కూడా," మిద్దె మీద నుంచి అరస్తాండారు.

"సరే...సరే..." అన్నారు బామ్మర్దులంతా.

అందరికన్నా ముందు చిన్నబామ్మర్దులిద్దరూ పోతాండారు ఉత్సాహంగా. వేరుశెనగ చెట్లు పెరికేసిండే చేన్లన్నీ గురుగుపూల తోటల్లాగా ఉండాయి. గురుగుపూలయితే తెల్లగానే ఉండాయి కానీ వాటి కాడలు మాత్రం ఎండిపోయిండాయి. చేను మధ్యలో కాయలు కోసేసిన

కందిసొళ్ళు నిలువు నామాల్లాగా ఉండాయి. వేరుశెనగవేయని పొలాల్లో పల్లేరు చెట్లు విరగ్గాసి ఎండిపోయిండాయి. చెప్పుల్లేకుండా వాటిల్లో అడుగు పెట్టినామంటే అంతే. ఎవరో పరినాట్లేసినారు. నీటివసతి బాగా ఉండాదేమో. పచ్చగా కళకళలాడతా ఉంది. అక్కడక్కడా మిరప తోటలు, టమోటాతోటలు, ఎక్కువగా చెరుకు తోటలు కనిపిస్తాండాయి. చెరుకులన్నీ ఎన్నిడ్సి తెల్లటి పూలు గాలికి ముందుకూ, వెనక్కూ ఊగిసలాడతాండాయి. ఎక్కడో చెరుకు గానుగాడుతాన్నెట్టు ఉండాది. బెల్లం వాసన ఘుమాయిస్తా వస్తాంది.

"బావా... ఆ పక్కన ఉండాదే వంక. ఆడ దెయ్యముండాది," అన్నాడు రమేష్. వాడు భలే జిత్తిరి నాయాలు. పీలేరు హాస్టల్లో ఉండి తొమ్మిదో తరగతి చదువుతా ఉండాడు. చదువు అబ్బలేదుగానీ తెలివి మాత్రం అలివి మాలినంత ఉండాది.

"నువ్వు చూసినావంట్రా?" అడిగినాను.

"అవును బావా చూసినా..."

"వోవి మాటలు నమ్మద్దు"

"బావా..అన్నీ అబద్దాలే. రాత్రుల్లో ఉచ్చలు పోసుకోను గూడా బయటకు రాడు వోడు. దెయ్యం చూసినాడంట దెయ్యం," అన్నాడు రమేష్ అన్న బాలాజీ.

ఆ మాటలకు అందరం నవ్వుకున్నాం. చెరువు కట్ట మింద పోతాండాం.

చెరువంతా రబ్బర్ చెట్లు అల్లుకోనుండాయి. అడుగున కొన్ని నీళ్ళుండాయి. రబ్బర్ చెట్లు లేని తావన తెల్ల కలువపూలు కళకళలాడతాండాయి. మమ్మల్ను చూసి చెరువు కోళ్ళు గునగున పోతాండాయి దూరంగా. మునుగుడు కోళ్ళు బుడుంగు బుడుంగుమంటా మునిగినాయి రెండు.

"బావా... బావా...నేను గురి చూసి రాయి ఏసినా...ఎంత... ఎంటికంతలో తప్పొయ్యింది. లేకుంటేనా... ఒగ చెరువుకోడి దొరికిండు," అన్నాడు సురేంద్ర.

"ఒగేళ కింద పడింటే ఎట్ల తెచ్చుకోనుందువురా," అడిగినా.

"నాకు ఈతొచ్చు... ఈతాడతా పొయ్యి తెచ్చుకోనుంటా."

"భలే వచ్చులే ఈత. కుక్కీత... ఈనికి ఇంగా సరిగ్గా ఈత రాదు బావా," అన్నాడు ముందు పోతాండే యుగంధర్. వాడు ఎనిమిదో తరగతి.

"అదో... ఆడ ఎలక్కాయలు కనిపిస్తాండాయి," శేఖర్ చేయిచూపిస్తా చెప్పినాడు.

"యాడ...యాడా..." అన్నారు మిగిలిన వాళ్ళంతా వేళ్ళ మీద నిగిడి చూస్తా.

శివ,సురేంద్ర,రమేష్ ముందుకు పరిగెత్తారు.

"రేయ్...రేయ్... చిన్నగా పొండి. పరిగెత్తద్దండి," అరిచినా.

నా అరుపులను వాళ్ళు పట్టించుకోలా. ఇంకా జోరుగా పరిగెత్తా పోయి కట్ట మలుపులో

మాయమైనారు. మేము కూడా కొంచెం జోరుగా అడుగులేసినాం. మలుపు దగ్గరకు పోయేలకు యలక్కాయల చెట్టు కనిపించింది. చెట్లో పుట్టాచెండ్లు మాదిరిగా కాయలు గుత్తులు గుత్తులుగా కనిపిస్తాండాయి.

"కాయలు చిన్నయిగా ఉండాయే," అన్నాను.

"లేదు బావా... పొయ్యినోరం వచ్చిన్నేం. అప్పుడు గూడా చెట్టెక్కి కాయలు పెరికినాం. బాగా మాగిపోయిండాయి," అన్నాడు బాలాజీ.

చెట్టు దగ్గరకు వచ్చినాం. లావుగా మూడుబారల ఎత్తుంది మొదలు.

"రేయ్... శివా... శివా... ఇప్పుడెక్కద్దురా చెట్టు. కాయలు అంతా మోసుకుంటా తిరగద్దా. తిరుక్కోని వచ్చేటప్పుడు పెరుక్కుందాంలే దిగు," అన్నాను. అప్పటికే వాడు సగం దూరం ఎగబాకేసినాడు.

"ఔనురా... దిగు..." అన్నారంతా.

"ఒక్కాయ పెరుక్కోని వస్తా. తినేదానికి," అన్నాడు.

"దిగు... రాళ్ళతో రాలగొట్టదాం," అన్నాను. వాడు దిగతానే రాళ్ళేసి కొన్ని కాయలు రాలగొట్టినాం. రాలిన కాయలు పగల కొట్టినాం. యలక్కాయ వాసన మా సుట్టకారం పరుచుకునింది. కొంచెం పుల్లగా, కొంచెం వగరుగా, ఎక్కువ తీపుగా... బాగుండాయి యలక్కాయలు.

అందరం తిరిగి గుట్టకు నడక మొదలుపెట్టినాం. దారిలో పరికిచెట్లు, ఉలింజి చెట్లు, రేణిచెట్లు, పుల్లీలకల చెట్లు ఉన్నేయి. ఆ చెట్లు కనపడిన తావనంతా ఆగాలంటారు వాళ్ళు. కోతుల మాదిరిగా చెట్ల సుట్టకారం చేరతాండారు.

అందరం గుట్ట ఎక్కినాము. కింద రాళ్ళు, కంప చెట్లు ఉన్నా పైనంతా బండ. పొడవాటి పెద్ద కోడిగుడ్డు సగం వరకూ నేలలో పూడ్సిపెట్టిన మాదిరిగా ఉండాదా బండ. అందరం బండ మీదకు పోతానే పల్లెలో ఇంటికళ్ళా చూసినాం. ఇంటి మీద మనుషులు లీలగా కనిపిస్తాండారు. గట్టిగా కేకలేస్తా, చేతులూపినారంతా. నేను ఈల వేసినా.

"అరె... బావ ఈలేస్తాండాడే. మళ్ళా ఎయ్ బావా... మళ్ళా ఎయ్ బావా," అంటా నా చేత మళ్ళీ ఈల వేయించినారు.

చిన్నప్పుడు మాపల్లెలో పీర్ల పండగప్పుడు ఎక్కువగా ఈలలు వేసేవాళ్ళం. టౌనుకు వచ్చినాక, మిత్రులతో కలిసి ఎప్పుడన్నా సినిమాకు పోతే ఈల వేసేవాడివి. పెళ్ళయితానే సినిమాలో ఈలలు వేయద్దని మా ఆవిడ నిబంధన విధించింది. వేయలేకుండా అణచుకున్న కోరిక కదా, వాళ్ళు అడిగిందే ఆలస్యం మళ్ళీ మళ్ళీ ఈల వేశాను.

"నీళ్ళుండే వెంకటేశ్వరుని అడుగు యాడుంది బాలాజీ," అడిగినా.

"ఆడుంది బావా" అంటా చేయి చూపిస్తానే ఆ పక్క నడిచినాడు బాలాజీ. అందరం వాడి ఎనకంటే నడిచినాం. నిముషంలో ఆడికి పోయినాం.

మాకన్నా ముందు పోయిన బాలాజీ, "ఇంగా నీళ్ళుండాయి బావా" అన్నాడు ఉత్సాహంగా.

రెండు మూరలు పొడవుతో ఏటవాలుగా అరచేతి వెడల్పుతో బండ మధ్య గాడి మాదిరిగా ఉండాది. దాంట్లో రెండు మూరల లోతులో నీళ్ళుండాయి. మోరడు పక్కన్నే వాళ్ళు గుర్రం అడుగు అని చెప్పిన రంధ్రం ఒకటుంది. అందులో కూడా లోతులో నీళ్ళుండాయి. గాడి పొడవుకూ బండ మీద బొట్టు పెట్టుకోవడం కోసం రాళ్ళు సాదిన గుర్తులు జిల్లంకోడి ఆడేదానికి తవ్వే బద్ది మాదిరిగా ఉండాయి.

శివ వంగి నీళ్ళు చేతికి తీసుకోని చిన్న రాయొకటి సాదతాండాడు.

"ఇందో బావా" అంటా నా చేతికి రెండు అల్సంద వడలు, అత్తిరాస ఒకటి ఇచ్చినాడు బాలాజీ.

"యాడియిరా" అన్నాను.

"ఇంటికాన్నించి కవర్‌లో ఏసుకోనొచ్చినాం" చెప్పినాడు యుగంధర్.

రాయి సాది అందరికీ నష్టన బొట్లు పెడతాండాడు శివ.

"ఎవరైనా కథ చెప్పండి" అన్నాను.

"బాలాజీ అన్న కథలు బాగా చెప్తాడు" అన్నాడు నరేంద్ర.

"ఆ... నాకేం రావు బావా..."

"ఆ పొద్దు తెలుగురాజును మూడు తుండేలుగా నరికేసిన కథ చెప్పలా?"

"ఆ కథా... నాకన్నా సురేషన్నకు బాగా వచ్చు. నాకు ఆ కథ చెప్పింది సురేషన్నే."

"ఔనా సురేష్...?

"ఔను బావా... ఎప్పుడో మాకు హిందీ ఐవోరు చెప్పిన్నాడా కథను... ఇప్పుడు సరిగ్గా గుర్తులేదు."

"ఫర్వాలేదులే... గుర్తున్నకాడికే చెప్పు" అన్నాను.

అందరూ కథ చెప్పు అనడంతో సురేష్ కథ మొదలుపెట్టినాడు. గుర్రంకొండ నవాబులు, తెలుగురాజుల కథ. దానికి జానపదం కలిసేసరికి బాగుంది. కథ అయిపోయాలకు అత్తిరాసలు, వడలు కూడా తినేసినాం. రెండు లీటర్ల బాటిల్‌తో నీళ్ళు తీసుకోనొచ్చిందారు. సగం ఖాళీ చేసేసినాం.

అక్కదేవతలు ఉండారని చెప్పిన తావకు పోవాలంటే మేముండే కాన్నించి చుట్టు తిరిగి రెండు ఫర్లాంగుల దూరం పోవాల గుట్టమీదే. గుట్ట తిప్పించిన ఇంగ్లీషు జె ఆకారంలో

ఉండాది. ప్రస్తుతం ఒక కొసన ఉండాం. ఈ కొస నుంచి ఆ కొసకు పోవాల.

"పోదామా," అన్నాను.

"పోదాం," అన్నారంతా.

మాటలు చెప్పుకుంటూ పోతాండాం. వందమీటర్ల దూరం దాటగానే మరో పొడవాటి బండ వచ్చింది. ఆ బండకు ఆ చివర ఉండాయి అక్కదేవతలు ఉండారని చెప్పుకునే పెద్ద బండలు. మేముండే తావన పైన విశాలంగా ఉంది బండ. ఆ బండ మీదుండే సుమారుపాటి గుండ్లు రకరకాల ఆకారాల్లో ఉండాయి. మెత్తని రాళ్ళ మాదిరిగా ఉండాయి. వాన చినుకులకు వాటికి వింత ఆకారాలు వచ్చినాయి. మేముండే తావు నుంచి తూర్పుగా నూరుబారల దూరంలో ఇంకో చిన్న గుట్ట ఉండాది.

"ఈడ్నించి ఎవరైనా రాయిని అంతదూరం వేసినారంటే వాళ్ళకు లక్షరూపాయలు ఇస్తా," అన్నాడు శివ.

"నిజంగానారా..." అడిగినా.

"నిజం బావా... ఏస్తే లక్ష ఇస్తా," అన్నాడు.

"ఉండాదంట్రా?"

"మీకెందుకు... ఎయ్యండి. ఇయ్యకపోతే అప్పుడడగండి" అన్నాడు వాడు ధీమాగా. అంత దూరం రాయి విసరలేం. అయినా అందరూ ఎవరి శక్తికొద్దీ వాళ్ళు ప్రయత్నించి చూసినారు. నేనొగ రాయిని తీసుకుని నిలువుకు గిర్రన తిప్పి విసిరి వేసినాను. వాళ్ళు వేసిందానికన్నా దూరం పోయింది.

"అరే... భలే ఏసినావే బావా... ఎట్ల ఏసేదది" అన్నారు వాళ్ళంతా ఆశ్చర్యంగా. మళ్ళీ ఒకసారి వేసి చూపించి, "దీన్ని గొర్రేటంటారు. గొర్లకాడికి పోయేవాళ్ళు ఎక్కువగా ఇట్లే ఏస్తాంటారు. మీరేసినట్టు ఏస్తే చెయ్యి నొప్పయితాది. ఇట్లేస్తే నొప్పి కాదు" అన్నాను.

వాళ్ళంతా కొంతసేపు ఆ విధంగా వేసినారు. అవంతా ఎప్పుడో చిన్నప్పుడు ఆడుకొన్న ఆటలు.

"పోదాం పాండి... ఇంగా ఆడికి పోవాలకదా మనం" అని ముందుకు నడవడం మొదలుపెట్టినా. అందరూ నావెనకే వస్తాండారు. కొంతదూరం పోయినాంక వెనక్కి తిరిగి చూస్తే శివ ఆడే కూచ్చోని ఉండాడు.

"ఏం శివా... రా" అన్నాను.

"నేను పద్దన్నే నీళ్ళు పోసుకోలా బావా... అక్కదేవతల దెగ్గిరికి నీళ్ళు పోసుకొనే పోవాలంట. మా అమ్మ చెప్పింది" అన్నాడు వాడు.

"రారా... అదంతా పెద్దోళ్ళకులే. పిల్లోల్లు ఎప్పుడయినా పోవచ్చురా" అన్నాను. వెంటనే

వాడు జింక పిల్ల మాదిరిగా పరిగెత్తతా వచ్చినాడు మా దగ్గరికి. తిరిగి నడక మొదలుపెట్టి అందరం బండ చివరకు చేరుకున్నాం. అక్కడ పెద్దపెద్ద గుండ్లు, ముళ్ళపొదలు ఉండాయి. పైకి పోతానే "ఇయ్యేనా బావా అక్కదేవతలుండే గుండ్లు" అడిగినారు వాళ్ళు.

యాభై బారల దూరంలో నిలువుగా పెద్ద బండలు ఉండాయి. వాటిని చూపించి, "ఇయ్యి కాదు... ఆడుండాయే, అయ్యి, ఆడికి పోవాల" అన్నాను.

ఆ పెద్ద బండలకాడికి చేరుకున్నాం. చాలా ఎత్తుగా ఉండాయవి. వాటికి కింద రకరకాల ఎత్తుండే బండలు ఉండాయి.

"చెప్పులు వదిలేసి పోవాల" ఎనకనించి భక్తుడు శివ అరస్తాండాడు.

చెప్పులను కింద వదిలేసి నేను ముందుగా మొదటి గుండు ఎక్కి ఒక్కొక్కరిని పైకి లాక్కున్నాను. అక్కడి నుంచి పైకి సులభంగానే పోయినాం. పైకి పోతానే నాకొగ క్షణం ఏదో మంచి పూలవాసన వచ్చినట్టు అనిపించింది.

"ఔను. ఏదో వాసన వస్తాండాది" అన్నాను.

ముక్కులు ఎగబీల్చి, "యాడ బావా వాసన. నాకేం రాలేదు" అన్నాడు సురేష్.

"రాత్రుల్లో అక్కదేవతలంతా గుట్టమింద కుచ్చోని మాటలు చెప్పుకుంటారంట. పున్నమప్పుడయితే జక్కీక ఏస్తారంట. రేత్రిలో ఎవురన్నా చూస్తే నెత్తురు కక్కుకోని చస్తారంట"

అందరూ ముక్కులు ఎగబీల్చి నాకొస్తాందని కొందరు, నాకు రాలేదని కొందరు అన్నారు.

"రేయ్... ఎవురేగానీ ఎడంచేతి పక్కకు చూడద్దండి. చాలా లోతుండాది," అన్నాను. కనీసమంటే పద్దైదిరవై బారల ఎత్తుంటాది ఆ బండ. అంత ఎత్తు నుంచి కిందకు చూస్తే నాకే ఒక్కక్షణం ఒళ్ళు జలదరించింది.

"కిందకు చూడకుండా రాండి" అంటా ముందుకు నడస్తాండాను మెల్లగా.

"అమ్మో... ఎంత లోతుందో" అంటా వచ్చినారు అందరూ.

రెండు బారల వెడల్పుతో విశాలంగా ఉండాది బండ. అక్కడికి చేరుకున్నాం. అక్కడి నుంచి కిందున్న చెట్లు, బండలు, చాలా చిన్నవిగా కనిపిస్తా ఉండాయి. అంతలో శేఖర్ జేబులోని సెల్ మోగింది.

"అరే... రెండు దినాలనించీ ఈ సెల్ పనిచేయలేదు బావా. ఈ పొద్దు పని చేస్తాండాది" అంటా ఆశ్చర్యంగా సెల్ తీసుకుని చూసి, "రిచర్డ్స్" అంటా ఆన్ చేసి, "హలో చెప్పు రిచర్డ్స్... ఆఁ... ఆఁ... రెండురోజుల నుంచి పనిచేయలేదురా. ఇక్కడ టవర్ అందదంట. ఈడ కూడా తిరుమల టవర్ అందింది. మేమంతా పెద్ద గుట్టెక్కినాం. ఆఁ... సరే రిచర్డ్స్. నేను రేపు కాలేజీకి రాలేనట్టే. బై... రిచర్డ్స్... రెండు రోజుల నుంచి ట్రై చేస్తాండాడంట" అంటా శేఖర్ రిచర్డ్స్‌తోనూ, మాతోనూ ఒకేసారి మాట్లాడినాడు.

"రేయ్... శివా.. యాడికిరా పోతాండావు. జారిందనుకో... ఒక్క ఎముకుండదు, ఎనిక్కిరా" అన్నాను.

"ఆడ తేనె ఉండాది బావా" అన్నాడు మేముండే బండకు ఒకపక్కన బార తగ్గులో ఉండే జీవిచెట్టును చూపిస్తా.

"ఉంటే ఉన్నీలే నువ్వు ఎనిక్కిరా..." అంటా సురేష్ ముందుకుపోయి వంగి చూసి, "ఔను బావా... తేనె ఉండాది" అనరిసినాడు గట్టిగా.

మా మాటలకు ఆ చెట్టులో ఉండే గుడ్లగూబ ఎగిరి వెళ్ళిపోయింది.

"గద్ద..." అన్నాడు శివ.

"కాదురా... అది గుడ్లగూబ. గద్దలయితే ఏదన్నా గుంటిమింద కుచ్చోని చుట్టుపక్కల చూస్తాంటాయి. లేదంటే ఆకాశంలో ఎగరతాంటాయి. పగలుపూట చెట్ల తొర్రల్లో, బండల మధ్య దాంకోనుండేవి గుడ్లగూబలు" అన్నాను.

"అయితే వోటికి తిండి ఎట్ల" నరేంద్రకు అనుమానం వచ్చింది.

"అయ్యి వెలుతురును చూడలేవు. రాత్రుల్లో తిరుగులాడతాయి... మీరెప్పుడూ ఇనలేదా గుడ్లగూబ అరిసేది రాత్రుల్లో?"

"ఇన్నేం బావా... పల్లెకాడ దిబ్బలకాడ ఉండాదే చింతచెట్టు, ఆడ ఒగోసారి రేత్రిల్లో గూక్... గూక్... అంటా అరస్తాంటింది. అది గుడ్లగూబని అమ్మ చెప్పింది" అన్నాడు రమేష్.

"మేమిన్నాం... మేమిన్నాం..." అన్నారంతా.

తేనె ఉండాదన్నె కాడికి పోయి చూసినా. మేముండే బండకు బారడు తగ్గులో పగులుండాది. దాంట్లో తొడలావు జీవిచెట్టు ఉండాది. నేనూ వంగి పరిశీలనగా చూసినా. దాంట్లో తేనెటీగలు లేవు. తేనె పట్టు పైన బెత్తెడు ఎడంతో తెల్లగా పాలిపోయిండాది. "దాంట్లో తేనె లేదు" అన్నాను.

"లేదు బావా... ఉండాది. కింద ఎర్రగా ఉండాది" అన్నాడు శేఖర్.

"లేదు... తేనె ఉంటే తేనెటీగలు ఎందుకు వెళ్ళిపోతాయి. ఎప్పుడేగానీ తేనెటీగలు పట్టును వదిలిపోయేటప్పుడు తేనెనంతా తాగేసి పోతాయి. దానికి తోడు అమావాస్య పొయ్యి రెండురోజులే అయిండాది. అమవాస్యకు తేనె ఆరగిస్తాయి. పున్నానికి తేనె పూరిస్తాయి. అట్ల ఎత్తుకున్నా ఇప్పుడు తేనె లేదు. ఎందుకు వృథా శ్రమ" అన్నాను.

ఎండ దంచేస్తోంది. అది చలికాలమే అయినా సూర్యుడు చిటపటలాడతాండాడు. చుట్టుపక్కలా నిర్మానుష్యంగా ఉండాది. ఎక్కడో బెల్లవాయిలు అరస్తాండే అరుపులు మాత్రం వినిపిస్తా ఉండాయి. వంట్లో చెమటలు కారతాండాయి అందరికీ. పొద్దున్నే తిన్న దోసెలు, కోడికూర, గుట్టకు తెచ్చుకొని తిన్న వడలు, అత్తిరాసాలు ఎప్పుడో అరిగిపోయినాయి. ఆకలి

వాయిస్తాండాది. అందరం కిందకు దిగడం మొదలుపెట్టినాం. జారతా, పడతా, లేస్తా అంతా కిందకు దిగేసినారు. నేనూ, శేఖర్ ఇంకా కొంచెం పైనే ఉండాం.

"బావా... దాంట్లో తేనె ఉండాది బావా. ఈటికి రా చూద్దువు. కింద ఎర్రగా ఉండాది. తేనె ఉండాది" అనరిచినాడు బాలాజీ కింద ఒక బండ మింద నిలబడుకోని.

"లేదురా..."

"ఎర్రగా ఉండాది. నేనూ, నువ్వూ, శివా పోయి తీసుకోనొద్దాం బావా," అన్నాడు.

సురేష్, శివ, నేనూ, శేఖర్ మళ్ళీ ఆ పెద్ద బండ ఎక్కినాం. పోతాపోతా మాతో పాటు బారడు పొడవుండే కట్టె ఒకటి తీసుకొని పోయినాం. శివ బండపైకి పోతానే చెట్టు దగ్గరకు దిగతాండాడు.

"రేయ్...రేయ్... నువ్వుండరా... నేను దిగతాను" అన్నాను.

వాడు వెనక్కు వచ్చినాడు. నేను కొంచెం కిందకు దిగి బాగా వంగి కట్టెతో తేనె పట్టుని పొడిచాలకు కింద పడిపోయిందది. తేనె కారలేదు.

"నే చెప్తే వింటిరా... తేనె లేదు చూడండి.. రేయ్ బాలాజీ... నువ్వు ఆ పక్కన తిరుక్కోని పోయి దాన్ని తీసుకోనిరా" అన్నాను.

మేం నలుగురం కిందకు దిగేసినాం. మిగిలిన నలుగురూ అక్కడే కుచ్చోని ఉండారు.

"ఏంరా... తేనెపట్టును తేలేదా" అన్నాను.

"ఆడికి దోవలేదు బావా" అన్నాడు.

"అట్ల తిరుక్కోని పొమ్మని చెప్పినా కదరా" అంటా నేనే తిరుక్కోని పట్టు పడిండే దగ్గరకు పోతాంటే, నా ఎనకే ఎలబారినారందరూ. సరిగా దోవలేదు. ఎప్పుడో ఏళ్ళ క్రితం నడిచిన గుర్తుగా దోవజాడ తెలుస్తా ఉంది. కంపచెట్ల కొమ్మలను చేతులతో పక్కకు తోసుకుంటా పోయినాం. నిట్టనిలువుగా ఉండే ఆ బండకు కింద నుంచి రెండు నిలువుల ఎత్తులో ఇంకో జీవిచెట్టు ఉంది. దాంట్లో పడిండాది తేనెపట్టు. బండ కిందకు పోతానే ఒక్కక్షణం ఒళ్లు జలదరించింది. బండకాడ శిథిలావస్థలో గుర్రం, కుక్క, ఏనుగు... అట్లాంటియే ఇంగా ఏవో బొమ్మలు ఉండాయి.

"ఏం బావా... నిలబడుకున్నేవు" అన్నారు వెనక నించి.

"పైన అక్కదేవతలుండారని అనుకున్నేం కదా. ఆడ కాదు. ఈడ ఉండారు. బొమ్మలుండాయి చూడండి" అన్నాను.

"యాడ... యాడ..." అంటా ఒకర్నొకరు తోసుకుంటా ముందుకు వచ్చి చూసినారు.

"ఏడు బొమ్మలుండాయి" అన్నాడు నరేంద్ర.

"అంతే... అక్క దేవతలు ఏడుమందంటారు. అందుకే ఏడు బొమ్మలుండాయి. బొమ్మలు

లేని తావన ఇటికిరాయిలు ఏడు పెట్టి పూజ చేస్తారు" అన్నాను.

"రాత్రుల్లో అక్కదేవతలంతా గుట్టమింద కుచ్చోని మాటలు చెప్పుకుంటారంట. పున్నమప్పుడయితే జక్కీక ఏస్తారంట. రేత్రిలో ఎవురన్నా చూస్తే నెత్తురు కక్కుకోని చస్తారంట. అందుకనే ఎవురూ రేత్రిలో ఈడికి రారు" అన్నాడు శివ.

"నీకెవరు చెప్పినార్రా" అడిగినాడు సురేష్,

"మా అమ్మ చెప్పింది. దండం పెట్టుకోండి" అంటా వాడు దండం పెట్టుకోని మట్టి కలిసిన కుంకాన్ని తీసుకొని బొట్టు పెట్టుకున్నాడు. నేను ఇంకొంచెం ఎగబడి పోయి జీవిచెట్టులో తగులుకొని ఉండే తేనెపట్టును తీసుకొని వచ్చినాను. దాదాపు ఒకటిన్నర మోర పొడవుతో అర్ధచంద్రాకరంలో ఉండాదది. అందురూ చేతికి తీసుకోని పరిశీలనగా చూసినారు.

ఆ తేనెపట్టును గబుక్కున నరేంద్ర చేతిలోనించి పెరుక్కున్నాడు శివ.

"ఇది... నాది... రెడ్డెమ్మ దేవతగినీ" అంటా నెత్తిన పెట్టుకొన్నాడు.

మా చిన్నప్పుడు రెడ్డెమ్మ దేవతను నెత్తిన పెట్టుకోని ఊర్లల్లోకి వచ్చేవాళ్లు కొందరు. రెండు మూరల వెడల్పుతో అర్ధచంద్రాకారంలో వెదుర్లతో అల్లింటారు. దాని మధ్యలో నల్లటి ఆడమనిషి తల బొమ్మ ఉంటాది. అమే రెడ్డమ్మ దేవత. ఆ బొమ్మకు చుట్టుపక్కల కండ్లు, చేతులు, శూలాలు, తలలు వెండితో చేసినోటియి ఉంటాయి. పల్లెల్లో వాళ్లు తమ కష్టాలు తీరినోళ్లు తయారుచేపించిన వెండిబొమ్మలతో నిండిపోయింటింది అది. దాన్ని నెత్తిన పెట్టుకుంటారు. నెత్తినున్న రెడ్డెమ్మ దేవతను ఒక చేత్తో పట్టుకుని, ఇంకో చేత్తో గంట వాయిస్తా ఇంటింటికి వచ్చేవాళ్లు.

"నువ్వెప్పుడు చూసినావురా రెడ్డెమ్మ దేవతను" అడిగినా.

"రెండుమూడుసార్లు చూసినా బావా... చానా రోజులయితాండాది" అన్నాడు శివ.

అందరం ఆట్నించి కిందకు వచ్చి తిరిగి నడక మొదులుపెట్టినాం. అప్పటికి పన్నెండు గంటలు దాటింది. ఎండ ఎక్కువగా ఉంది. ఒళ్లంతా చెమటతో తడిసిపోయింది. ముదురాకుపచ్చ రంగులో మామిడి ఆకులమాదిరిగా ఉండే చెట్టు నన్ను ఆకర్షించింది. గబగబా ఆ చెట్టు దగ్గరకు పోయినా. చెట్టు కొన కొమ్మల్లో గుత్తులు గుత్తులుగా పిందెలుండాయి.

"ఏం చెట్టు బావా" అడిగినాడు శేఖర్.

"ఇదా... కొమ్మిచెట్టు... దీని పూలు మంచి వాసన వస్తాయి. ఎంత ఎక్కువగా ఉంటాదంటే మల్లెపూల కన్నా ఎక్కువగా ఉంటాది వాసన. ఇప్పుడు పిందెలుండాయి. ఇంగో రెండు వారాల ముందరయింటే పూలు ఉన్నిండు" అన్నాను.

అందరూ ఆ పిందెలను పట్టుకోని వాసన చూసినారు.

"పిందెలేదన్నా వాసన వస్తాయంటరా...? అక్కదేవతలుండే బండకాడ వాసన వస్తాదని

గజమ్మ చెప్పింది కదా. ఈ కొమ్మిచెట్లు ఆ చుట్టుపక్కల యాడన్నా ఉన్నింటాయి. వోళ్లు కొమ్మిచెట్ల పూతకాలంలోనే వచ్చింటారేమో. వచ్చినప్పుడంతా వాసన వచ్చింటాది" అన్నాను.

"ఔనౌను బావా" అన్నాడు సురేష్.

అందరం మాటలు చెప్పుకుంటా నడక మొదలుపెట్టినాం. దారిలో ఉలింజిచెట్లు, పరికిచెట్లు, రేణిచెట్లు, పుల్లీలకల చెట్ల దగ్గర ఆగినారంతా. కాయలు కోసి, కొన్ని తింటా... కొన్ని జోబీల్లో వేసుకుంటాండారు. పుల్లీలకల పండ్లు తినిందానికి నాలుక వంకాయపువ్వు రంగులోకి మారిపోయిండాది.

"జోబీల్లో వేసుకోవద్దండిరా... కర్రయితాయేమో, బాటిల్‌లో వేయండి, ఇంటికి పోతానే మీ పెద్దక్క అడగతాది. కాయలు తీసకపోలేదనుకో.. మల్ల ఆ నస భరించలేను" అన్నాను నేనూ కొన్ని పండ్లు పెరుక్కోని తింటా.

అందరూ పండ్లు పెరికి బాటిల్‌లో వేస్తాండారు.

"ఉలింజి పండ్లు వగురుగా ఉండాయి బావా" అన్నాడు రమేష్.

"ఇయ్యి పెద్దులింజి పండ్లు కదా. అంత బాగుండవు. నల్లగా ఉండేటియే పెరకండి. ఎర్రగా ఉండేటియి పచ్చియి. చిన్నులింజి పండ్లయితే ఎర్రగా అయితే మాగినట్టు" అన్నాను.

"నీకెట్ల తెలుసు బావా ఇయ్యన్నీ" అడిగినాడు బాలాజీ.

"నేను మీ మాదిరి చిన్నప్పటి నుంచి హాస్టల్లో ఉండి చదువుకోలేదురా. ఇదేంది చిన్నగుట్టే కదా. మా ఊర్లో అయితే ఎర్రగొండ ఉండాది. కొండ కిందనే మా చేనుండాది. ఆదివారం చేనుకాడికి పోయినామంటే గ్యారెంటీగా కొండ ఎక్కతాం. ఆ కొండ చానా పెద్దది. మొలకల పున్నమప్పుడు, కార్తీక మాసమప్పుడు కొండ మింద గరుడస్తంభంలో నూనె పోసి దీపం ముట్టిస్తాం. ఆ దీపం చుట్టుపక్కల ఇరవై ముప్పై మైళ్ల దూరం కనిపిస్తాది" అన్నాను.

అందరం తిరిగి చెరువుకట్ట కాడికి వచ్చినాము. అక్కడ యలక చెట్టుకు అతుక్కునేసినారంతా. శివ కోతిమాదిరిగా అంత పెద్ద చెట్టును ఎక్కేసినాడు. కొమ్మల్లో తిరగతా కాయలు పెరికి కింద వేస్తాండాడు. టవల్‌లో మూటగట్టుకున్నాం. అందరి జేబుల్లో, చేతుల్లో కూడా యలక్కాయలుండాయి. శివ తేనెపట్టును నెత్తిన పెట్టుకున్నాడు మళ్లా. అందరం ఇల్లు చేరేలకు రెండు గంటలయింది.

గబగబా నీళ్లు పోసుకోని తిని డ్యూటీకి బయలుదేరినా. నన్ను ఎర్రావారిపాళెం క్రాసు కాడ దింపేదానికి శేఖర్ వాళ్ల మేనమామ బైక్ తీసుకోని బయల్దేరినాడు. సురేష్ కూడా వచ్చాడు.

నేను బయలుదేరుతాంటే దాదాపు అందరూ వచ్చినారాడికి. రెండురోజులకే పోతాన్నిందానికి నామింద యాష్టపోయినారు. జాగ్రత్తలు చెప్పినారు. మేం ముగ్గురం బైక్‌లో

బయలుదేరినాం. అది బస్సుపోయే దారే అయినా చానా ఘోరంగా ఉండాది. కంకర్రాళ్లు తేలి, గుంతలు పడి, అక్కడక్కడా ఇసుక... బైక్‌ను చానా మెల్లిగా నడుపుతా ఉండాడు శేఖర్. ఎప్పుడో చానా ఏండ్ల కింద మా ఊర్లో ఎర్రగొండలో పీల్చిన వాసన మళ్లా వచ్చింది.

"శేఖర్... శేఖర్... ఆపు" అన్నాను.

"ఏం బావా..." అంటా బైక్‌ను ఆపినాడు శేఖర్.

"మీకేం వాసన రాలా" అన్నాను చుట్టూ చూస్తా.

ముక్కులు ఎగబీల్చి, "ఏందో మంచి వాసన వస్తాండాది" అన్నారు వాళ్లు.

"అదో... ఆడుంది రాండి" అంటా దారికి నాలుగుబారల దూరంలో చిన్నచిన్న బండరాళ్ల మధ్యలో ఉండే కొమ్మిచెట్టు కాడికి పిల్చుకోని పోయినా వాళ్లను. గుత్తులు గుత్తులుగా తెల్లటి చిన్నపూలు. ఆ చెట్టు దగ్గరయ్యేలకు ఇంగా ఎక్కువ వాసన.

ఒక గుత్తిని తెంపి వాసన చూసి, "ఎంత బాగుంది బావా వాసన" అన్నాడు సురేష్.

"మల్లెపూల కన్నా ఎక్కువ వాసన వస్తాండాయి" అన్నాడు శేఖర్.

"దీని పండ్లు కూడా చానా తీయగా ఉంటాయి. ఇంగో మూడు నెల్లయితే పండ్లుంటాయి" అన్నాను.

"మేముండే దగ్గర, విజయవాడలో ఎక్కడా కనిపించవే ఇవి" అన్నాడు శేఖర్.

"టౌన్లల్లో ఉండవు. పల్లెల చుట్టుపక్కల, గుట్టల్లో ఉంటాయంతే. పాండి పోదాం" అన్నాను.

మేము ఎర్రావారిపాళెం క్రాసుకాడికి పొయ్యేలకు బస్సు రెడీగా ఉన్నింది. బస్సెక్కేసినా. కనిపించేంత దూరం బస్సును చూస్తా శేఖర్, సురేష్ అక్కడే నిలబడుకోని ఉండారు.

బస్సులో తిరుపతికల్లా పోతా ఉంటే నన్ను రెండు రోజులుగా అంటి పెట్టుకోని ఉండే కొమ్మిపూల వాసన దూరమవుతాన్నెట్టు అనిపించింది.

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 13 మార్చ్ 2005*
*తెలుగునాడి, ఆగస్ట్ 2005*
*కథ 2005*